మినీకథ

పెళ్ళి!

"ఇదిగో! మీ ముద్దులకూతురు సంగతి మీరే చూసుకోండి! ఏనాడన్నా తండ్రీ, కూతురు నన్ను ఖాతరు చేశారు గనకనా?" చిరాకూ, నిష్ఠూరమూకలబోసిన స్వరం, వంటింట్లోంచి.

"ఏమైందే ఇప్పుడు?" షర్టు వేసుకుని తీరిగ్గా గుండీలు పెట్టుకుంటూ వంటింటి గుమ్మందాకా వచ్చారు వెంట్రావు.

"అదిగో! ముంగిలా మాట్లాడుతుందేమో చూడండి! నామీదకైతే గయ్యిన లేస్తుంది. మరి?" ఆవిడ మాటలకు మధ్యలోనే అడ్డొస్తూ—

"అమ్మడూ: నా కళ్ళద్దాలు కనిపించ లేదు. కాస్త చూసి పెట్టు తల్లీ"— అన్న తండ్రి మాటలకి సమాధానంగా, ఒలుస్తున్న ఆలుగడ్డ అక్కడపెట్టి, చేతులు కడుక్కుని, కొంగుకి తుడుచుకుంటూ వంటింట్లోంచి యివతలికొచ్చిందికూతురు.

అమ్మాయి ముందుగదిలో కెళ్ళిందాకా ఆగి, "ఎన్నిసార్లు చెప్పానే! నీకు? పిల్లల ముందు దురుసుగా, నిష్ఠూరంగా మాట్లాడొద్దని. సర్లే! ఇంతకీ సంగతేమిటి?" అన్నారు.

"ఆఁ! ఏముంది? దాని మనసులోని మాట చెప్పమంటే చెప్పదు. పోనీ పెద్దోడితోనైనా చెప్పొచ్చుగా! వాడెంత బుజ్జగించినా—ఏసేమిరా అంటుంది. అసలా కుర్రాడికేం వంక చెప్పండి? కోరికోరివచ్చిన సంబంధం. కానీ కట్నం లేకుండా చేసుకుంటామన్నారు. అసలు మీరే దానికి అలుసిచ్చి నెత్తికెక్కించుకున్నారు అయినా—"

"అబ్బబ్బ!! నీ ధోరణి కాస్త ఆపు. ఏ కారణం లేకుండా అమ్మాయి మాత్రం ఎందుకిష్టం లేదంటుంది. నువ్వు దానితో ఇక ఆ విషయం ఏం మాట్లాడక— నేను కనుక్కుంటాగానీ!"

"ఇదిగో నాన్నా! బయట అరుగుమీద మర్చిపోయావ్!"అంటూ కూతురు అందించిన కళ్ళజోడుతీసుకుని బయటికెళ్ళిపోయారాయన.

సాయంత్రం ఆరు గంటలప్పుడు "అమ్మడూ! అలా గుడిదాకా వెళ్ళొద్దాం రా!" అన్న తండ్రిమాటల్లో అంతరార్థం వూహిస్తూ, చెప్పులేసుకుని తండ్రితోబాటు బయలుదేరింది.

"చూడు తల్లీ! ఏ విషయమైనా సంకోచపడకుండా మనసువిప్పి నాతో చెప్పే చనువు నా దగ్గర నీకుందనే నా నమ్మకం. అందుకే ఉపోద్ఘాతాలు లేకుండా సూటిగా అడుగుతున్నాను. చెప్పుతల్లీ! ఆసంబంధం నువ్వెందుకు కాదంటున్నావు?"

"అబ్బాయి అందంగా లేడా?"

"అతనికేం? అందగాడే"

"ఉద్యోగం నచ్చలేదా?"

"బ్యాంక్‌లో ఆఫీసర్ కదా!"

"ఇంకా ఇద్దరు చెల్లెళ్ళ బాధ్యత ఉందనా"

"నాదీ! అంకెల జీతమేకాబట్టి అది భారం కాదనుకో!"

"మరి: కాబోయే అత్తగారు నిన్ను ప్రశ్నలడిగిన తీరుకి ఆవిడంటే భయపడి వొద్దంటున్నావా?"

"ఉహు—పెద్దవాళ్ళకి, పైగా అత్తగారికి ఆమాత్రం చాదస్తం సహజమే!"

"లేకపోతే—అతను నీతో మాట్లాడాలంటే మేమంతాబయటిగదిలోకెళ్ళినప్పుడు అతనేమైనా చనువుగా ప్రవర్తించాడా?"

"ఛఛ! అదేంలేదు:"

"మరేమిటి తల్లీ! నీ అభ్యంతరం! రేపు ఉదయానికి వాళ్ళకే సంగతీ చెప్పాలి కదా! కాదన్నందుకు సమర్థించుకోడానికి కారణం మనకైనా స్పష్టంగా తెలియాలికదా!"

"ఏ లా చెప్పాలో తెలియడంలేదు నాన్నా! తీరా చెప్పాక— మీరంతా వెక్కిరించి తేలిగ్గా కొట్టేస్తారేమోనని భయం!"

"లేదమ్మా! నీ అభిప్రాయానికి, నేనెప్పుడూ విలువిస్తానని నీకు తెలుసుగా! చెప్పు తల్లీ! అది ఎలాంటి కారణం అయినా సరే!"

"మరే, అతను మనింటికొచ్చినప్పుడు:..

"ఆఁ.... వచ్చినప్పుడు ?"

"స్వీటు, హాటు పెట్టాం కదా! కాఫీ యిచ్చాం కదా!"

"అవునూ! అయితే?"-

"అబ్బ! ఎంత అసహ్యంగా - పెద్ద చప్పుడు చేసుకుంటూ తిన్నాడో! నోరంతా పెద్దగా తెరిచి, అలా కసా, పిసా నమూల్తూంటే...వాకెంత కంపరమేసిందో? నీకు తెల్సుగా నాన్నా! అలా తినడం నా కెంత అసహ్యమో? ఆఖరికి కాఫీ కూడా- జుర్ జుర్ మంటూ- ఛీ! అతనెంత అందంగా వున్నా ఆ శబ్దాలు నా కిప్పటికీ వినిపిస్తున్నట్లే! చీదరగా వుంది! మీ అందరికీ యిష్టమైన సంబంధమే. ఏ విషయంలోనూ ఏవంకా పెట్టలేని సంబంధమే! కానీ....!"

"ఆఁ....ఆఁ....అవుననుకో : కానీ.... ఇంత చిన్న...." యింట్లో తరచూ ఈ విషయంలో అమ్మాయికీ, తమ్ముళ్ళకీ అయ్యే గొడవలూ అప్పుడప్పుడూ పెద్దాడుకూడా, తమ్ముళ్ళతోపాటు అమ్మాయిని వుడికించడానికి ఇదే ఆయుధంగా వుపయోగించడమూ తను చూసీ చూడనట్లు ప్రవర్తించడం గుర్తొచ్చి, ఏం మాట్లాడాలో....ఎలా సర్ది చెప్పాలో అర్థం కాక ఆలోచనల్లో పడ్డారాయన.

*